### లేహ్‌లో కొట్టుకుపోయిన టీ-72 యుద్ధ ట్యాంక్..

# అయిదుగురు సైనికులు మృతి

**లడాఖ్:** చైనా సరిహద్దు ఉన్న నదిలో విషాదం చోటుచేసుకున్నది. యుద్ధ ట్యాంక్ ఆ నదిలో కొట్టుకుపోయింది. దాంట్లో అయిదుగురు సైనికులు ఉన్నారు. వారిలో ఓ జేసీవో ఆఫీసర్ ఉన్నారు. నియంత్రణ రేఖ వద్ద లేహ్‌లో ఉన్న దౌలత్ బేగ్ ఓల్డీ ఏరియా వద్ద ఈ ఘటన జరిగింది. రెస్క్యూ అధికారులు ఒకరి మృతదేహాన్ని వెలికితీశారు. మరో నలుగురు గల్లంత య్యారు.ప్రమాదంలో మరణించిన వారిలో జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్ ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.



శిక్షణలో ఉన్న సైనికులు.. మందిర్ మోర్చ్ వద్ద ఉన్న బోధి నదిలో యుద్ధ ట్యాంక్‌తో క్రాస్ చేస్తున్నారు. ఆ సమయంలో ఆ ట్యాంక్ కొట్టుకుపోయింది.లేహ్ నుంచి 148 కిలోమీటర్ల దూరంలో ఆ ట్యాంక్ ఉన్నది. టీ-72 యుద్ధ ట్యాంక్ ప్రమాదంలో కొట్టుకుపోయింది. ట్రైనింగ్ జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా నీటి మట్టం పెరిగినట్లు అధికారులు చెప్పారు. ఉప్పొంగుతున్న నదిలో యుద్ధ ట్యాంక్‌తో పాటు సైనికులు నీట మునిగి మరణించారు.భారతీయ ఆర్మీ సైనికుల మృతి పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సంతాపం తెలిపారు. దురదృష్టకర సంఘటన జరిగినట్లు తన ఎక్స్ అకౌంట్‌లో వెల్లడించారు. దేశం కోసం విరోచిత సేవలు అందించిన ఆ సైనికులను ఎన్నటికీ మరిచిపోలేమన్నారు. బాధిత కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో దేశం ఆ కుటుంబాలకు అండగా ఉంటుందని మంత్రి రాజ్‌నాథ్ వెల్లడించారు.

# వానల్లో మెరుపు కావాలంటే..



**న్యూఢిల్లీ :** కాలం మారినప్పుడు ముందుగా ఆ ప్రభావం చర్మంపైనే పడుతుంది. వాతావరణ మార్పులతో చర్మం పొడిబారిపోవడం, మొటిమలు, మచ్చలు ఏర్పడటం వంటి సమస్యలు ఎదురవుతాయి. వర్షకాలంలో జిడ్డు చర్మం ఉన్నవారు ఈ సమ స్యల్ని ఎక్కువగా ఎదుర్కోవాల్సి వస్తుంది. జిడ్డు తోపాటు చర్మంలో తేమ ఎక్కువగా ఉంటే చికా కులు తప్పవు. తేమ పెరగడం వల్ల చర్మం రంగు మారుతుంది. ఈ ప్యాక్స్ వేసుకోవడం వల్ల వానల్లో మెరుపులా మెరిసిపోవచ్చు..కీరదోస:కీరాలో మన శరీరానికి మేలుచేసే గుణాలు చాలా ఉంటాయి. కీరదోస రసాన్ని ముఖానికి అప్లయ్ చేస్తే.. జిడ్డు మాయమవుతుంది. దీనిని టోన ర్‌లా కూడా వాడొచ్చు. కీరాని మిక్సీలోగానీ, బ్లెండర్‌లోగానీ వేసి గ్రైండ్ చేసి చర్మానికి బాగా పట్టించి.. 15 నిమిషాల తర్వాత చల్లటి నీళ్లతో కడిగేయాలి.పుదీనా:పుదీనాలో ఎన్నో ఔషధగు ణాలు ఉంటాయి. ఇది చర్మానికి కొత్త నిగారింపును ఇస్తుంది. కొన్ని పుదీనా ఆకుల్ని తీసుకుని పేస్టు చేసుకోవాలి. అందులో ముల్తానీ మట్టి, తేనె, పెరుగు వేసి బాగా కలపాలి. దీనిని ముఖా నికి అప్లయ్ చేసి ఆరిన తర్వాత కడిగేయాలి.

తరచుగా ఇలా చేయడం వల్ల ముఖం కాంతి మం తంగా తయారవుతుంది.వేప:అనేక చర్మ సమస్యలకు వేపాకులు దివ్యౌషధంగా పనిచేస్తాయి. రెం డు స్పూన్ల ముల్తానీ మట్టి, రెండు స్పూన్ల వేపాకు రసం, రోజ్ వాటర్ వేసి బాగా కలిపి ఫేస్ ప్యాక్‌లా వేసుకోవాలి. 20 నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగితే జిడ్డు తగ్గి ముఖం అందంగా మెరిసిపోతుంది.

# బాలుడి కాలుకు సర్జరీ బదులు..

# సున్తీ చేసిన వైద్యులు

**ముంబై:** గాయపడిన బాలుడి కాలుకు సర్జరీ బదులు డాక్టర్లు సున్తీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పొరపాటు జరిగింది. ఇది తెలిసి షాకైన బాలుడి తల్లిదండ్రులు వైద్యాధికారులతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డాక్టర్ల తప్పు, నిర్లక్ష్యంపై దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. షాహాపూర్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు ఆడుకుంటుండగా కాలుకు గాయమైంది. దీంతో బాలుడి తల్లిదండ్రులు జూన్ 15న షాహాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు.



కాగా, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ బాలుడి కాలుకు సర్జరీ బదులు సున్తీ చేశారు. జరిగిన పొరపాటు తెలుసుకున్న డాక్టర్లు గాయమైన కాలుకు కూడా శాస్త్రచికిత్స చేశారు. ఇది తెలిసి బాలుడి పేరెంట్స్ షాక్ అయ్యారు. వైద్యాధి. కారుల తోపాటు షాహాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు అదే వయస్సున్న ఇద్దరు బాలురకు సర్జరీ చేయాల్సి ఉండటంతో తమ కుమారుడికి పొరపాటున సున్తీ చేసి ఉంటారని ఆరోపించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మరోవైపు తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు ప్రయత్నించారు. బాలుడి ప్రైవేట్ భాగంలో కూడా సమస్య ఉందని వైద్యాధికారి గజేంద్ర పవార్ తెలిపారు. దీంతో ఆ బాలుడికి రెండు ఆపరేషన్లు చేయాల్సి వచ్చిందన్నారు. అయితే డాక్టర్లు ఒక సర్జరీ గురించి మాత్రమే బాలుడి పేరెంట్స్‌కు చెప్పి ఉంటారని, రెండో ఆపరేషన్ గురించి చెప్పడం మరిచి ఉంటారని అన్నారు.

# బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వండి..

## నితీశ్ కుమార్ పార్టీ డిమాండ్

**పాట్నా:** బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) డిమాండ్ చేసింది. ఎన్డీయేలో భాగస్వామ్యంగా ఉన్న ఆ పార్టీ జాతీయ



కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసింది. బీహార్ ఆర్థికంగా, అభివృద్ధిలో వెనుక ఉండటాన్ని ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హో దా అవసరమని, దీర్ఘకాలంగా ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.కాగా, బీహా ర్‌లో ఇటీవల 65 శాతానికి పెంచిన రిజర్వేషన్ కోటాను కాపాడు కోవా ల్సిన ఆవశ్యకతను కూడా ఈ తీర్మానం లో పేర్కొన్నారు. న్యాయ పర పరిశీలన, రక్షణ కోసం రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూ ల్‌లో రిజర్వేషన్ కోటాను చేర్చాలని జేడీయూ ప్రతిపా దించింది. అలాగే ఈ కోటాను నిరం తరాయంగా అమలు చేస్తామని జేడీయూ హామీ ఇచ్చింది.మరోవైపు జేడీయూ కీలక సమావేశం తర్వాత ఆ పార్టీ సీనియర్ నేత మీడియాతో మాట్లాడారు. బీహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా డిమాండ్ కొత్తది కాదని తెలిపిరు. బీహార్ అభివృద్ధిని వేగవంతం చేయడం, రాష్ట్ర ప్రత్యేక సవాళ్లను పరిష్కరించడంలో ఇది కీలకమని అన్నారు.

# జేడీయూ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా

## సంజయ్ జా నియామకం



**న్యూఢిల్లీ:** జనతాదళ్ యునైటెడ్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపీ సంజయ్ జా నియమి ంచారు. ఢిల్లీలో జేడీయూ జాతీయ ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. అక్కడ జరిగిన భేటీలో వర్కింగ్ ప్రెసిడెంట్‌పై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రత్యేక హోదాను బీహార్‌కు ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ ఆ మీటింగ్‌లో బీహార్ సీఎం నితీశ్ కుమార్ తీర్మానం చేశారు. బీహార్ రాష్ట్ర వృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ అవసరమన్నారు. ఇటీవల రిజర్వేషన్ కోటాను 65 శాతానికి పెంచుతూ బీహార్‌లో తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఆ కోటా పెంపు అంశాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో పెట్టాలని జేడీయూ ప్రతిపా దించింది.

# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను రౌస్ అవెన్యూ

# కోర్టులో హాజరుపర్చిన సీబీఐ



ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ సీబీఐ అధికారులు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు హాజరుపర్చారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు తదుపరి విచారణ నిమిత్తం కేజ్రీవాల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి అప్పగి ంచాలని సీబీఐ అధికారులు కోర్టును కోరారు.కోర్టు నిర్ణయం వెలువడాల్సి ఉంది. కాగా, ఇటీవల సీబీఐ అధికారులు తీహార్ జైలు నుంచి అర్వింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసి రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. దాంతో కోర్టు మూడు రోజుల సీబీఐ రిమాండ్ విధించింది. ఇవాళ్టితో సీబీఐ రిమాండ్ ముగియడంతో అధికారులు మరోసారి కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరుపర్చారు.కాగా ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కేజ్రీవాల్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 19న అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను అదే కేసులో నాలుగు రోజుల క్రితం సీబీఐ అరెస్ట్ చేసింది.

# బోల్తాపడిన బొలెరో..

# 25 మంది కూలీలకు గాయాలు

**నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కనున్న లోయలో పడిపోయింది. దీంతో అందులో ఉన్న 25 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో కలిసి సహాయకచర్యలు చేపట్టారు. గాయపడినవారిని దవాఖానకు తరలించారు. పది మందికి తీవ్రంగా గాయాలయ్యాయని, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.ప్రమాద సమయంలో వాహనంలో 45 మంది ఉన్నారని తెలిపారు. ఓవర్ లోడ్, మితిమీరిన వేగం కారణంగా ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. బాధితులు మహాసముద్రం, కోడేరు గ్రామాలకు చెందినవారిగా గుర్తించారు. బాధితుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఇదికూడా చదవండి.



.బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి..ఎన్డీయే పాలిత బీహార్ వరుసగా బ్రిడ్జిలు కూలుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే వరుసగా నాలుగు బ్రిడ్జిలు కూలిపోయిన విషయం తెలిసిందే. గురువారం కిషన్‌బాగ్ జిల్లాలో, జూన్ 23న తూర్పు చంపారన్ జిల్లాలో, 22న సిశాన్‌లో, 19న అరారియాలో ఇలాగే వంతెనలు కూలిపోయాయి. తాజాగా మరో బ్రిడ్జి కూలింది. శుక్రవారం మధుబని ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న వంతెన ఒక్కసారిగా కూలిపోయింది.దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో 75 మీటర్ల పొడవైన ఈ వంతెనను బీహార్ గ్రామీణ పనుల విభాగం 2021 నుంచి నిర్మిస్తోంది. ఇది మధుబని సుపాల్ జిల్లాల మధ్య భూతాహి నదిపై ఉంది. అయితే, ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భూతాహి నదిలో నీటి మట్టం పెరిగింది. నీటి ఉద్ధృతికి నిర్మాణంలో ఉన్న వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. కాగా, రాష్ట్రంలో గత తొమ్మిది రోజుల వ్యవధిలోనే ఇది ఐదో ఘటన కావడం గమనార్హం. దీంతో నిర్మాణ పనుల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# అయోధ్య రోడ్లపై నిలిచిన నీరు..

## ఆరుగురు అధికారులపై సస్పెన్షన్




**అయోధ్య:** అయోధ్య కొత్తగా నిర్మించిన రోడ్లు నాసిరకంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షానికే ఆ రోడ్లు జలమయం అయ్యాయి. జూన్ 23, 24వ తేదీల్లో కురిసిన వర్షాలతో.. కొత్తగా నిర్మించిన అయోధ్య రోడ్లు గుంతలు పడ్డాయి. అనేక చోట్ల నీరు నిలిచిపోయింది. రామ్‌పాథ్ రూట్లో అన్నీ నీటి గుంతలు ఏర్పడ్డాయి. సుమారు 15 బైలేన్లు, వీధులన్నీ జలమయం అయ్యాయి. 14 కిలోమీటర్ల రూట్‌లో అనేక ప్రదేశాల్లో రోడ్డు తెగిపోయింది.ఈ నేపథ్యంలో యూపీ సర్కారు చర్యలు తీసుకున్నది. ఆరుగురు అధికారులను సస్పెండ్ చేసింది. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధ్రువ్ అగర్వాల్,

అసిస్టెంట్ ఇంజినీర్ అనుజ్ దేశ్‌వాల్, జూనియర్ ఇంజినీర్ ప్రభాత్ పాండే, యూపీ జల్ నిఘంకు చెందిన ఆనంద్ కుమార్ దూబే, రాజేంద్ర కుమార్ యాదవ్, మహమ్మద్ షాహిద్‌లను సస్పెండ్ చేశారు. స్పెషల్ సెక్రటరీ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు అగర్వాల్, దేశ్‌వాల్‌ను సస్పెండ్ చేశారు.రామ్‌పాథ్ రూట్లో కొత్త రోడ్డు కొట్టుకుపోవడం పట్ల ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో మరింత విచారణకు ఆదేశించారు.

# తిరుమలలో గోవిందుడి దర్శనానికి

# 18 గంటల సమయం



**తిరుమల :** కలియుగ ప్రత్యక్షదైవంగా కొలువబడుతున్న తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి టోకెన్లు లేకుండా వచ్చిన భక్తులకు సర్వదర్శనానికి 18 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండిపోయాయి.నిన్న స్వామివారిని 66,256 మంది భక్తులు దర్శించుకోగా 30,087 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.54 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు.తిరుమల హోటల్స్‌లో సరసమైన ధరలకే ఆహారాన్ని అందించాలితిరుమలకు వచ్చే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించడమే టీటీడీ లక్ష్యమని ఈవో జె శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని పెద్ద, జనతా హోటళ్లపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు.సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి ప్రముఖమైన హోటళ్లతో జాబితా రూపొందించడానికి ఇండియన్ క్యులినరీ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకులు చలేశ్వరరావు , తాజ్ హోటల్స్ జీఎం చౌదరి సూచనలను ఆహ్వానించినట్లు తెలిపారు.

# గో బ్యాక్ ఎమ్మెల్యే కాలె యాదయ్య..

### వికారాబాద్‌లో కాంగ్రెస్ కార్యకర్తల నిరాహార దీక్ష

**హైదరాబాద్:**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్‌లో చేరడాన్ని స్థానిక హస్తం నేతలు వ్యతిరేకిస్తున్నారు. కాలె యాదయ్య చేరికను నిరసిస్తూ వికారాబాద్ జిల్లా నవాబుపేటలో మండల కాంగ్రెస్ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్, కార్యకర్తలు నిరాహార దీక్షకు దిగారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎక్కడ ఉందని ప్రశ్నించిన కాలె యాదయ్య.. ఇప్పుడు అదే పార్టీలో చేరడం హాస్యాస్పదంగా ఉందని ఈ సందర్భంగా కొండల్ యాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఆయన గతంలో అనేక కేసులు పెట్టించాడని గుర్తుచేశారు. యాదయ్య చేరిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్యను సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వద్దకు తీసుకెళ్లి పార్టీ కండువా కప్పించారు.



కాగా, పార్టీని వీడుతున్న కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదని.. తెలంగాణ సాధించిన మనకు గిదో లెక్కనా? అని వ్యాఖ్యానించారు. పార్టీయే నాయకులను తయారు చేస్తుంది తప్ప.. నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరని స్పష్టం చేశారు. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనే అని తెలిపారు. మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తదని చెప్పారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# నీట్ యూజీ పేపర్ లీక్ కేసు..

### గుజరాత్‌లోని ఏడు చోట్ల సీబీఐ సోదాలు




**న్యూఢిల్లీ:** నీట్ యూజీ పేపర్ లీకేజీ కేసులో ఇవాళ సీబీఐ తనిఖీలు నిర్వహిస్తోంది. గుజరాత్‌లోని ఏడు ప్రదేశాల్లో సీబీఐ అధికారులు సోదాలు చేస్తున్నారు. అనుమానితుల ఇండ్ల వద్ద ఇవాళ ఉదయం నుంచి తనిఖీ జరుగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆనంద్, ఖేడా, అహ్మదాబాద్, గోధ్రా జిల్లాల్లో ఈ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. జారండ్‌లోని హజారీబాగ్‌కు చెందిన ప్రిన్సి పల్, వైస్ ప్రిన్సిపల్‌ను సీబీఐ శుక్రవారం అరెస్టు చేసింది.

నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో మరో హిందీ పత్రిక జర్నలిస్టును కూడా అరెస్టు చేశారు.నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో మొత్తం ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ఒక ఎఫ్ఐఆర్ నమోదు కాగా, దర్యాప్తు జరుగుతున్న అయిదు రాష్ట్రాల్లో మిగితా కేసులు నమోదు అయ్యాయి. బీహార్, గుజరాత్‌ల నుంచి ఒక కేసు దర్యాప్తు జరగ్గా, రాజస్థాన్‌లో మూడు కేసుల్లో దర్యాప్తు జరు గుతో ంది.ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ అడ్మిషన్ల కోసం నీట్ యూజీ పరీక్షలను ఎన్టీఏ నిర్వహి స్తుం ది. ఈ ఏడాది మే 5వ తేదీన 4750 కేంద్రాల్లో ఆ పరీక్షలను నిర్వహించారు. సుమారు 2 3 లక్షల మంది ఆ పరీక్షలు రాశారు. జూన్ 23వ తేదీన సీబీఐ తన తొలి ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది.

### ప్రొటోకాల్ రగడ.. జూబ్లీహిల్స్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

# పాల్గొన్న కార్పొరేటర్ భార్య



**హైదరాబాద్:** అధికారం ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు బదులు వారి కుటుంబ సభ్యులు హాజరవుతున్నారు. ఇలాంటి ఘటనే హైదరా బాద్‌లోని జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకున్నది. జూ బ్లీహిల్స్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ జరుగుతున్నది. కార్యక్రమానికి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హాజరయ్యారు. అయితే స్థానిక కార్పొరేటర్, కాంగ్రెస్ నేత బాబాఫసియుద్దీన్ అనారోగ్యం కారణంగా రాలేకపోయారు. దీంతో ఆయన స్థానంలో అతని సతీమణి కార్యక్రమానికి వచ్చారు.దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘించి కార్పొరేటర్ సతీమణి అధికారిక కార్యక్రమంలో ఎలా పాల్గొంటారని నిలదీశారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తలకు మధ్య గొడవ జరిగింది. తోపులాటకు దారితీయడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు.